# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :239 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 6 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :239 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SUN 6 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur







## ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
## పీఆర్సీకి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

- ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం
- పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు, రెండు డీఏల విడుదలకు అంగీకారం
- సరెండర్ లీవులు, అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయాలు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం



- మిగతా 2లో

## మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి చంద్రబాబులా పారిపోం

- స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్న గుడివాడ అమర్నాథ్
- ఎన్నికల్లో పోటీ చేయడానికి కూటమి పార్టీలు వణుకుతున్నాయని ఎద్దేవా
- ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ కచ్చితంగా పోటీ చేసి తీరుతుందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తమ అధినేత జగన్ ఎప్పుడూ ఎన్నికల బరి నుంచి తప్పించుకునే నాయకుడు కాదని అన్నారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికలు నిర్వహించినప్పుడు చంద్రబాబు భయపడి పారిపోయారని ఎద్దేవా చేసిన ఆయన, ప్రజాస్వామ్యంలో గెలుపోటములను ప్రజల తీర్పు ద్వారానే తేల్చుకోవాల్సి

- మిగతా 2లో

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్స వాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. "సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల

- మిగతా 2లో

## టీచర్ స్థానాన్ని మరో టీచర్ తోనే
# భర్తీ చేయగలం

- ఉపాధ్యాయ దినోత్సవం
- విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- సీఎంగా మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేశానని వెల్లడి
- టెక్నాలజీ పెరిగినా గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని స్పష్టం
- చిన్నప్పుడు టీచర్ చేతిలో దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దేది గురువేనని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయ నియామకాలు అత్యంత కీలకమని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు న్యాయం చేసేందుకు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి మెగా డీఎస్సీని నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, భక్తవత్సలం అనే గురువు చేతిలో తాను దెబ్బలు తిన్నానని చెప్పారు. అయితే, గురువుల వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. భారతీయ సంస్కృతిలో "మాతృదేవో భవ, పితృదేవో భవ" తర్వాత "ఆచార్య దేవో భవ" అని గురువుకే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని, వారిలో దాగి ఉన్న శాస్త్రవేత్తలను, క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఒక ఉపాధ్యాయుడి స్థానాన్ని మరో ఉపాధ్యాయుడు మాత్రమే భర్తీ చేయగలరని చంద్రబాబు అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, బయటి ప్రపంచం గురించి కూడా

- మిగతా 2లో




## చంద్రబాబు జిల్లా పర్యటనలు కూటమి మధ్య కలతలు రేపుతున్నాయా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల పర్యటనలు కూటమిలోని మిత్ర పక్షాల నేతల మధ్య విభేదాలు తెలెత్తేలా చేస్తున్నాయి. చంద్రబాబు నియోజకవర్గాల పర్యటనలో పనిచేయని అధికారులను సహజంగా హెచ్చరిస్తుంటారు. వారి పనితీరుకు మార్కులు కూడా వేస్తుంటారు. అలాగే ఎమ్మెల్యేలకు కూడా రేటింగ్ లు ఇస్తారు. కొందరు టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుపైనే చంద్రబాబు గతంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే జనసేన ఎమ్మెల్యేను కూడా పనితీరు బాగాలేదని అనడంపై గ్లాస్ పార్టీలో ఒకింత అసహనం మొదలయింది. నియోజవర్గం ప్రజల ముందు తమ పార్టీ ఎమ్మెల్యేను అవమానించడమేంటని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నిధులు ఇస్తే నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని జనసేన నేతలు అంటున్నారు.

**నరసాపురం పర్యటనలో...**

కూటమిలో నరసాపురం జనసేన పార్టీ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఉద్దేశించి చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో చెప్పిన మాటలు ఆపార్టీలో అసంతృప్తికి కారణమయయాయి. “పనితీరు బాగోలేదు. మీరు, నియోజకవర్గ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లా మొత్తం పనితీరు బాగానే ఉంది, కానీ మీ నియోజకవర్గం మాత్రం బాగోలేదు. దాదాపు అన్ని అంశాల్లోనూ మీరు మైనస్‌లో ఉన్నారు. 25 సూచికల్లో 23 ప్రతికూలంగా ఉన్నాయి. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.ఎమ్మెల్యేగా మీరు తప్పనిసరిగా పనిచేయాలి. నరసాపురం నియోజకవర్గం వెనుకబడిపోయింది. సమస్యలను నా దగ్గరకు తీసుకురావడం మాత్రమే కాకుండా, ప్రజల సహకారంతో వాటిని మీరే పరిష్కరించాలి. నోడల్ అధికారిని మార్చి, చురుకుగా పనిచేసే అధికారిని నియమించండి.” అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను జనసేన నేతలు తప్పుపడుతున్నారు.

**ముందు మీ పార్టీ ఎమ్మెల్యేను...**

ఒక ఎమ్మెల్యే పనితీరును ప్రజల సమక్షంలో బహిరంగంగా ప్రశ్నించడం మంచి పరిణామమే అయినా , ఇలాంటి మంచి సంప్రదాయాన్ని ముందుగా తన బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గంలోనో, లేదా దెందులూరు నియోజకవర్గంలో తాను ఏరికోరి తీసుకొచ్చిన తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారి నియోజకవర్గంలోనో ప్రారంభించి ఉంటే మరింత సమంజసంగా ఉండేదని కొందరు సోషల్ మీడియాలో అభిప్రాయపడుతన్నారు. ప్రజల ముందు ఎమ్మెల్యేల పనితీరుపై ప్రశ్నించే ఈ మంచి సంప్రదాయం అందరికీ సమానంగా వర్తిస్తేనే దానికి నిజమైన విలువ ఉంటుంది, కూటమికి మంచి జరుగుతుందని అంటున్నారు. జనసేన ఎమ్మెల్యేను ప్రజల ముందు ముఖ్యమంత్రి నిలదీయడాన్ని జనసేన నేతలు, ఆ పార్టీ కార్యకర్తలు తప్పుపడుతున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ఉన్న చోట టీడీపీ నేతల పెత్తనం సాగుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అంటున్నారు.

## ఉక్రెయిన్‌పై దాడులకు విరామం - పుతిన్ ఆదేశం

- మొదటి పేజి తరువాయి

దౌత్య చర్చల కోసం అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ శనివారం (సెప్టెంబర్ 5) రష్యా చేరుకున్నారు.

అమెరికా ప్రతినిధుల రాక నేపథ్యంలో శనివారం నుంచి ఉక్రెయిన్?పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశించారు. పుతిన్ ఆదేశాలతో రష్యా సైన్యం ఉక్రెయిన్?పై దాడులకు తాత్కాలిక విరామం ఇచ్చింది. మొదటగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈ తాత్కాలిక కాల్పులు విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించాడు. అమెరికా ప్రతినిధులు రష్యా, ఉక్రెయిన్ దేశాలలో పర్యటించే సమయంలో తాము కూడా ఎలాంటి దాడులు చేయబోమని, రష్యా కూడా అదే రీతిలో స్పందించాలని కోరారు. ఉక్రెయిన్ ప్రతిపాదించిన తాత్కాలిక సీజ్ ఫైర్ ఒప్పందానికి తాజాగా రష్యా అంగీకరించింది. దీంతో ఇరుదేశాల మధ్య మూడు రోజుల పాటు యుద్ధం ఆగిపోనుంది.నాలుగున్నరేండ్లుగా సాగుతోన్న రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగానే ఇరుదేశాల ప్రతినిధులతో దౌత్యపరమైన చర్చలు జరిపేందుకు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్?లతో కూడిన ప్రత్యేక బృందాన్ని రష్యాకు పంపాడు. అమెరికా టీమ్ యుద్ధం ముగింపు కోసం రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులతో చర్చలు జరపనుంది. మాస్కోలో పుతిన్‌తో చర్చలు ముగిసిన తర్వాత ఈ అమెరికా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఆదివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకుని జెలెన్స్కీతో సమావేశం కానుంది.

# ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. పీఆర్సీకి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

అమరావతి: ఏపీలో ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుతో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై సీఎం చర్చించారు. అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. 2022 నాటి సరెండర్ లీవ్‌లు జనవరిలో ఇవ్వాలని నిర్ణయించింది. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం మంచి వాతావరణంలో జరిగిందని సూర్యనారాయణ తెలిపారు. పీఆర్సీతో పాటు రెండు డీఏలు, ఒక ఏడాది సరెండర్ లీవ్‌లు, రిటైరైనవారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రీస్టోరేషన్, ఈహెచ్ఎస్ బకాయిలు ప్రతి నెలా ఒకటో తేదీన ట్రస్ట్‌కి చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండాలని తాము కోరామని సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఐఆర్ విషయంపై కొంత సమయం ఇవ్వాలని సీఎం చెప్పారన్నారు.

అనంతరం ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ సానుకూల వాతావరణంలో సీఎంతో చర్చలు జరిగాయన్నారు. పొరుగు సేవల సిబ్బందిని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చాలని, గ్రామ సచివాలయ సిబ్బందికి నోషనల్ ఇక్రిమెంట్ ఇవ్వాలని కోరామన్నారు. సీఎం ప్రకటనపై ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

- మొదటి పేజి తరువాయి

దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. “ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు ‘ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్’ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం” అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

**గత ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వానికి తేడా ఇదే..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117 కారణంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటుకు వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసిందని, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి ‘మోడల్ ప్రైమరీ స్కూల్’ వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. దీని ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఈ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్లో పారదర్శకత కోసం ‘లీప్ యాప్’ను తీసుకొచ్చామని, బదిలీల ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

**ప్రతి విద్యార్థి ప్రాణం విలువైందే..**

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ విషాదకర ఘటనను ప్రస్తావిస్తూ లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పేరెంట్–టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి పక్కన కూర్చుని మాట్లాడిన ఓ విద్యార్థిని రెండు రోజులకే ఆత్మహత్య చేసుకోవడం తనను, ముఖ్యమంత్రిని తీవ్రంగా కలచివేసిందని అన్నారు. “ప్రతి బిడ్డ ముఖ్యమే, ప్రతి ప్రాణం విలువైందే (ఎవ్రీ చైల్డ్ మ్యాటర్స్, ఎవ్రీ లైఫ్ మ్యాటర్స్). పిల్లల్లో ఏ చిన్న మార్పు కనిపించినా ఉపాధ్యాయులు గమనించాలి. వారిలో మానసిక స్థైర్యాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది” అని పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఫెయిల్ (ఫీూxూ) అంటే ‘ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్’ అని పిల్లలకు నేర్పించాలని సూచించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగంపై చూపిస్తున్న శ్రద్ధను వివరిస్తూ, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యత పెంచాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను ఉదాహరణగా చూపుతూ, ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే అద్భుతాలు సృష్టించగలడని, విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలడని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు విద్యా పర్యటనలకు పంపి, అక్కడి ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం.. రెడ్ అలర్ట్ జారీ!

దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షం ముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి ‘రెడ్ అలర్ట్’ జారీ చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి.

రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయని విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది.నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్‌లో మోటార్ల సాయంతో నీటిని తోడివేస్తున్నప్పటికీ, కొన్ని దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రేటర్ నోయిడా, నోయిడా ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది.

ఈ వర్షాల ప్రభావంతో ఢిల్లీ వాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అయితే, ఆదివారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, సెప్టెంబర్ 7 నుంచి కేవలం తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయకూడదు

- మొదటి పేజి తరువాయి

వారి దైనందిన జీవితాలపై కూడా టీచర్లు శ్రద్ధ వహించాలని సూచించారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతోందని.. ఈ సమయంలో ఉపాధ్యాయులే విద్యార్థులను సరైన దారిలో నడిపించాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావిస్తూ.. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారనే విషయాలను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. “విద్యార్థులు స్క్రీన్ చూసే సమయాన్ని తగ్గించడం ప్రస్తుతం చాలా అవసరం. క్రీడలు, సృజనాత్మక ఆవిష్కరణలపై వారిలో ఆసక్తిని పెంపొందిస్తే.. ఫోన్‌కు దూరంగా ఉంచొచ్చు. అంతేకాదు, నూతన సాంకేతికతలపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. బోధనతో విద్యార్థుల్లో చాలా మార్పు తీసుకురావచ్చు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. ప్రతి చిన్నారిలో ఒక ప్రతిభ ఉంటుంది. దానిని ఉపాధ్యాయులు గుర్తించి, ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరు. పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదు. వారిని బయటకు తీసుకువెళ్లి.. నిజ జీవిత నైపుణ్యాలు, సమాజ పరిస్థితులపై అవగాహన కల్పించాలి. సిలబస్‌తో పాటు నైతిక విలువలూ నేర్పాలి” అని మోదీ ఉపాధ్యాయులకు సూచించారు.

**82 మంది ఉపాధ్యాయులకు అవార్డులు..**

ఈ ఏడాది 82 మంది ఉపాధ్యాయులు (ఎుఖఎ్ప్రవతీం), విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య అక్షరాస్యత శాఖ నుంచి 48 మంది ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌ల నుంచి 21 మంది అధ్యాపకులు.. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత విభాగం నుంచి 13 మంది నైపుణ్య శిక్షకులు ఉన్నారు. పురస్కార గ్రహీతలు తమ బోధనా పద్ధతులు, అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

## ‘ఆపరేషన్ సిందూర్’ దెబ్బ.. భారత్‌పై పాక్ కొత్త ఉగ్ర వ్యూహం

భారత్‌పై ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ మార్చుకుంటున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. నేరుగా పాక్ సంబంధాలు బయటపడకుండా కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు పేర్కొన్నాయి. ముఖ్యంగా ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ పూర్తిగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల పాత ఉగ్ర మాన్యువల్స్‌ను వాడటం తగ్గించినట్లు సమాచారం. ఇవి భారత దర్యాప్తు సంస్థలకు బాగా పరిచయం కావడంతో దాడుల వెనుక పాక్ సంబంధాలను గుర్తించడం సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు.ఇప్పుడు అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ పేరుతో ఉన్న మార్గదర్శకాలను విదేశాల్లోని హ్యాండ్లర్లు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ఇస్లామాబాద్, కరాచీ, రావల్పిండి నుంచి ఆదేశాలు వచ్చేవని చెప్పారు. ప్రస్తుతం సిరియా, ఇరాక్ వంటి ప్రాంతాల నుంచి హ్యాండ్లర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు.భారత్‌లోని యువతను నేరుగా సంప్రదించకుండా సోషల్ మీడియా ద్వారా లక్ష్యంగా చేసుకుంటున్నారని అధికారులు వివరించారు. ముందుగా వ్యక్తుల ప్రొఫైల్స్‌ను గుర్తిస్తారు. ఆ తర్వాత పరిచయం పెంచుకొని నియామకం, మత ఛాందసవాదం వైపు మళ్లించడం, దాడులకు ప్రణాళిక రూపొందించడం జరుగుతున్నట్లు తెలిపారు.

**‘లోన్ వుల్ఫ్’ దాడులపై దృష్టి**

ఇలాంటి నెట్‌వర్క్‌ల ద్వారా ‘లోన్ వుల్ఫ్’ దాడులను ప్రోత్సహించాలని పాక్ ప్రయత్నిస్తున్నట్లు అధికారులు చెప్పారు. వీటికి పెద్ద మొత్తంలో డబ్బు, భారీ మాడ్యూల్స్ అవసరం ఉండవు. ఆన్‌లైన్‌లో ప్రభావితమైన వ్యక్తులు సొంతంగా దాడులకు పాల్పడే అవకాశం ఉంటుంది. దీంతో దాడి వెనుక అసలు కుట్రదారులను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు కష్టమవుతుంది.పాక్ ఇలా వ్యూహం మార్చుకోవడానికి ‘ఆపరేషన్ సిందూర్’ ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. మరోసారి అలాంటి ఆపరేషన్‌ను ఎదుర్కొనే పరిస్థితి పాకిస్థాన్‌కు లేదని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ పాక్ ఉగ్ర మౌలిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని చెప్పారు. అంతర్జాతీయ సంస్థల ఒత్తిడి, ముఖ్యంగా ఎఫ్ఏటీఎఫ్ నిఘా కూడా పాక్ వ్యూహం మారడానికి మరో కారణమని తెలిపారు.

భవిష్యత్తులో భారత్‌పై జరిగే ఏ ఉగ్రదాడినైనా కేవలం సరిహద్దు దాటి జరిగిన ఉగ్ర చర్యగా చూడబోమని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. దాన్ని తమపై జరిగిన యుద్ధ చర్యగా పరిగణిస్తామని ప్రకటించింది. దీంతో పాకిస్థాన్ తన ప్రమేయం బయటపడకుండా ‘డినయబిలిటీ’కి (తిరస్కరణవాదం) ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## టీచర్ స్థానాన్ని మరో టీచర్‌తోనే భర్తీ చేయగలం

- మొదటి పేజి తరువాయి

నేర్చుకోవాలని, ఈ విషయంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు.

గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టానని, టెలికాం రంగంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో కీలక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. దాని ఫలితంగానే హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా మారిందని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు సత్తా చాటుతున్నారని అన్నారు. అమెరికా, ఆసియా దేశాల అభివృద్ధికి జ్ఞానమే పునాది అని, రాబోయే 10–15 ఏళ్లలో భారత్ స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఒకప్పుడు సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండగా, ఇప్పుడు పోటీతత్వం పెరిగి విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు.ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు.కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

**ఇప్పట్లో విస్తరణ లేనట్లే!**

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

## మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి చంద్రబాబులా పారిపోం

- మొదటి పేజి తరువాయి

ఉంటుందన్నారు. స్థానిక పోరును ఎదుర్కొనేందుకు తమ పార్టీ అన్ని విధాలా సమరసన్నాహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఒక్కటైనప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు వణుకుతున్నాయని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి స్థానిక సమరాన్ని వాయిదా వేసేందుకు, ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు కూటమి నేతలు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని, ఈ స్థానిక ఎన్నికల ఫలితాలతో తమ అసలు రంగు బయటపడుతుందనే భయంతోనే కూటమి నాయకులు జంకుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా ‘కార్డన్ అండ్ సెర్చ్’ ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు.యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు ఏడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

## ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు.మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో ‘బీసీ ఐక్య వేదిక సదస్సు’ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

## కోటలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,05:
కోట పట్టణంలోని అల్లారెడ్డి వెంకటకృష్ణా రెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, వివిధ ఆటపాటలతో విద్యార్థులను విశేషంగా అలరించారు. గురువుల ప్రదర్శనలు పిల్లల్లో నవ్వులు పూయించాయి. అనంతరం ఉపాధ్యాయులకు నిర్వహించిన షాట్‌పుట్ తదితర క్రీడా పోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటారు. విద్యార్థులు తమ ప్రియతమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి.కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే గురువుల ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు అండగా డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు

## సమాజ సేవలోనే నిజమైన ఆత్మసంతృప్తి: డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 05:**
సమాజ సేవలోనే నిజమైన ఆత్మసంతృప్తి లభిస్తుందని, పేద విద్యార్థులు, నిరుపేదలకు అండగా నిలవడమే తన జీవిత పరమావధి అని ప్రముఖ సంఘ సేవకులు, 'ఆంధ్రశ్రీ' అవార్డు గ్రహీత డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న పురపాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది నిరుపేద విద్యార్థులకు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు సొంత ఖర్చులతో విద్యా సామాగ్రిని అందజేశారు. అదేవిధంగా పాఠశాల మౌలిక వసతుల మెరుగుదలకు క్రాంప్టన్ కంపెనీ సీలింగ్ ఫ్యాన్, విద్యుత్ ట్యూబ్ లైట్ సెట్, రెండు నీల్ కమల్ కుర్చీలను వితరణగా అందించారు. పాఠశాల అవసరాలను ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా తెలియజేసిన వెంటనే స్పందించి కావాల్సిన సామాగ్రిని సమకూర్చడం ఆయన సేవా నిరతికి నిదర్శనమని ఉపాధ్యాయులు కొనియాడారు.

<u>ప్రభుత్వ పాఠశాలలకు ఊపిరిపోస్తున్న నిత్య సేవకుడు</u>

ఉపాధ్యాయులు ఇ. శివతేజ నాయక్ మాట్లాడుతూ గతంలో భరద్వాజ గిరిజన కాలనీ పురపాలక పాఠశాలలో పనిచేసిన సమయంలోనూ కోటేశ్వరబాబు పాఠశాల అవసరాలకు ఉదారంగా సహాయం చేశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం అండగా నిలుస్తున్న ఆయన సేవలు అభినందనీయమన్నారు.
పదేళ్లుగా అలుపెరగని సేవా ప్రస్థానంగత పదేళ్లుగా ప్రతి ఏటా నిరుపేద విద్యార్థులకు విద్యా



సామాగ్రిని ఉచితంగా అందిస్తూ డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు సేవలందిస్తున్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ఆయన అందిస్తున్న సహాయ సహకారాలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అండగా నిలుస్తున్నాయి. అక్షర నిధికి ఆసరాగా నిలుస్తున్న ఆయన సేవా తత్పరత పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె. వేణు, ఇ. శివతేజ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం

## టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి



**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,05:**
కోట మండలంలోని అల్లా రెడ్డి వెంకటకృష్ణా రెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పలువురు నాయకులు, ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉనుగుంటపాలెం పీఏసీఎస్ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆవుల సుబ్బయ్య, శ్రీ షిరిడీ సాయి సేవాసమితి చైర్మన్ అల్లం రామయ్య ముఖ్య అతిధులుగా పాల్గొని ఉపాధ్యాయులందరికీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.సమాజ నిర్మాణంలో, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు.అనంతరం దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దారా మస్తానయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ హాజీర్, పిఈటీ వల్లి అహ్మద్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయిణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డా. సర్వేపల్లి అడుగుజాడల్లో నారా లోకేష్

**- విద్యా రంగంలో సంస్కరణలతో ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి**
**- టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్‌రావు**

**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 05:**
భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలు, అడుగుజాడల్లో నడుస్తూ ఆంధ్రప్రదేశ్‌లో విలువలతో కూడిన ఉత్తమ సమాజ నిర్మాణానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్‌రావు కొనియాడారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణకు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీకాళహస్తీశ్వర స్వామివారి తీర్థప్రసాదాలు, శ్రీకాళహస్తి కోవాను అందించి శుభాకాంక్షలు తెలిపారు.విద్యా వ్యవస్థ పటిష్ఠంగా పనిచేసి నాణ్యమైన బోధన అందించినప్పుడే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందనే లక్ష్యంతో నారా లోకేష్ పాఠశాల విద్యలో అనేక సంస్కరణలు చేపట్టారని ఉమేష్‌రావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, పాఠశాలలకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం ద్వారా ఉపాధ్యాయ వృత్తికి ఇస్తున్న ప్రాధాన్యతను చాటుకున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, దీక్షలు నిరుద్యోగ యువతను గందరగోళానికి గురిచేసేలా ఉన్నాయని ఉమేష్‌రావు విమర్శించారు. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడుతూ, విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న నారా లోకేష్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు అభినందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**- గురువుల పట్ల విద్యార్థుల అభిమానాన్ని చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు**





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 05:**
పట్టణంలోని ఎల్ఐసీ కాలనీ సమీపంలో ఉన్న సెయింట్ జేవియర్స్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మకుమారి సమాజం సభ్యులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ షేర్లి సమక్షంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ, ఉపాధ్యాయినుల బృందాన్ని ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, నాటకాల ద్వారా గురువుల పట్ల తమకున్న గౌరవం, అభిమానాన్ని చాటుకున్నారు. బ్రహ్మకుమారి సమాజం సభ్యురాలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి గొప్ప వ్యక్తుల స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. దేశానికి, సమాజానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు కాదు.. రైతులకు రుణమాఫీ చేయాలి

## ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 05:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్లకు రుణమాఫీలు చేయడం కాకుండా దేశానికి అన్నం పెట్టే రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు.శ్రీకాళహస్తిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన రైతు సంఘం జిల్లా వర్క్‌షాప్‌లో జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన హేమలత మాట్లాడుతూ బడా కార్పొరేట్లకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని రుణాల పేరుతో మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయడంతో పాటు పెట్టుబడి సాయం పెంచాలని కోరారు.తిరుపతి జిల్లాలో ఆరు చక్కెర కర్మాగారాలు ఉండగా ఐదు మూతపడ్డాయని, వాటిలో రెండు




సహకార రంగానికి చెందినవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సహకార చక్కెర కర్మాగారాలను పునఃప్రారంభించి చెరుకు రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో సహకార మామిడి ఫ్యాక్టరీలు లేకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, ప్రభుత్వం పల్ప్ పరిశ్రమలను ఏర్పాటు చేసి మామిడి రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.రైతాంగ సమస్యలను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించకపోతే తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హేమలత హెచ్చరించారు.కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పందికాళ్ల మణి, జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, రంగయ్య, ధనంజయులు, మనోహర్, గురవయ్య, విజయకుమారి, సుగాలమ్మ, చెన్నకేశవులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

**- 54 మంది లబ్ధిదారులకు రూ.32.62 లక్షల చెక్కుల పంపిణీ**
**రెండేళ్లలో నియోజకవర్గంలో 1,110 మందికి రూ.7.61 కోట్ల సాయం : ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్**

గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 05:
అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు.
గూడూరు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ 28వ విడతకు సంబంధించిన 54 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.32 లక్షల 62 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే




మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో గూడూరు నియోజకవర్గ పరిధిలో 1,110 మందికి రూ.7 కోట్ల 61 లక్షల 82 వేల ఆర్థిక సహాయం అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు.
గూడూరు పట్టణంతో పాటు గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితుల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను సంప్రదించగా, వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. తమకు అందించిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోమని, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## ఇ -ప్యాక్ కంపెనీ సమీపంలో డ్రైవర్ తలపై దూసుకెళ్లిన లారీ



**తడ : పెన్ పవర్, సెప్టెంబర్ 5**
తడ మండల పరిధిలోని ఇ - ప్యాక్ కంపెనీ సమీపంలో తరచూ ప్రమాదాలు సంభవించి ప్రాణ నష్టం జరుగుతుంది. ఈ క్రమంలోనే శనివారం ఘోర ప్రమాదం సంభవించింది. ఓ లారీ డ్రైవర్ ఆగి ఉన్న మరో లారీ కింద నిద్రిస్తుండగా ఆ లారీ డ్రైవర్ స్టార్ట్ చేసి తీసుకువెళ్లే సమయంలో క్రింది నిద్రిస్తున్న లారీ డ్రైవర్ తలపై ఎక్కి వెళ్లడంతో డ్రైవర్ రాజీవ్ గాంధీ అక్కడే మృతి చెందాడు. ఆ కంపెనీ దగ్గర రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు పార్కింగ్ చేయడంతో గతంలో కూడా ప్రమాదాలు జరిగాయని స్థానికులు అంటున్నారు. కనీసం స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు కారణాలుగా ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. తడ మండల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సులూరుపేట సి హెచ్ సి కి తరలించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలుచేపట్టాలని కూడా స్థానికులు, వాహనదారులు అంటున్నారు.

# వివాహ వేడుకలు, వినాయక ఆలయ పూజల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్





గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,05:
గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్‌లో పార్టీ కార్యకర్త కడివేటి మస్తాన్, శాంతి దంపతుల కుమార్తె వివాహ నలుగు కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించి, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానికులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

# సుబ్బమ్మ మృతికి బొజ్జల బృందమ్మ సంతాపం

## కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు



**శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,సెప్టెంబర్ 05:**
మండలంలోని రెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆయకట్టు ప్రెసిడెంట్ తిరుపాలు ధర్మపత్ని కలవపూడి సుబ్బమ్మ అకాల మరణం పట్ల శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న వెంటనే రెడ్డిపల్లెలోని సుబ్బమ్మ నివాసానికి చేరుకున్న బృందమ్మ, ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి భావోద్వేగంతో నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న తిరుపాలు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కష్ట సమయంలో బొజ్జల కుటుంబం అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.సుబ్బమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# 64 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

## - పేదలు, రైతులకు భూ హక్కుల భద్రతే ప్రభుత్వ లక్ష్యం: బొజ్జల బృందమ్మ



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 05:**
శ్రీకాళహస్తి మండలం మన్నవరం పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి చింతల్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభ, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ 64 మంది అర్హులైన రైతులు, నిరుపేదలకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి, రైతుకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యజమానులకు పక్కా హక్కులు కల్పించి, వారి ఆస్తులకు భద్రత కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.పాసుపుస్తకాలు అందుకున్న రైతులు బొజ్జల కుటుంబానికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రంగనేని చెంచయ్య నాయుడు, మండల అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్, కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

# నెలబల్లి లో నిషేధిత ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం



**దొరవారి సత్రం, పెన్ పవర్, సెప్టెంబర్ 5**
దొరవారి సత్రం మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీల్లో గత రెండు దశాబ్దాల కాలానికి నేటికీ ప్రభుత్వ భూముల విస్తీర్ణాన్ని పరిశీలిస్తే 60% శాతం అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురైనట్లు గానే చూస్తున్నాము. దీనికి
ప్రధాన కారణం ఆ పరిధిలోని వీఆర్వో, వి ఆర్ ఏ లతోపాటు ప్రధాన పాత్ర
మండల స్థాయి రెవెన్యూ అధికారులదే ప్రధాన పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. నిరుపేదలు సెంటు భూమి ఆక్రమిస్తే చర్యలు చేపడుతారే కానీ! బడా బాబులు వారికి అవసరమైనంత నేలను ఆక్రమించి స్వాధీనం చేసుకుంటే వారిపై చర్యలు చేపట్టడానికి వెనుకాడతారు. అసైన్డ్, సిజెఎఫ్, పిఓబి, ఫారెస్ట్, గ్రేసింగ్ ల్యాండ్స్ ఏ భూమిని
ఆక్రమించకుండా వదిలిపెట్టడం లేదు. భూముల పరిరక్షణకు ప్రభుత్వం ముందు జాగ్రత్తగా కొన్ని ప్రాంతాల్లో భూముల సంరక్షణకు 22ఏ అనే చట్టం కింద ప్రభుత్వ భూములు, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూ, కోర్టు వివాదాల్లోని భూములను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేరుస్తారు. ఈ జాబితాలో ఉన్న సర్వే నంబర్లు ఎలాంటి క్రయ, విక్రయాలకు ఆస్కారం లేకుండా గిఫ్ట్,తనఖా వంటి లావాదేవీలు జరిపేందుకు సబ్ రిజిస్టార్ కార్యాలయానికి అనుమతులను నిషేధించింది. అయినా భూమి విలువను బట్టి, స్థలాన్ని బట్టి కంత్రి భూ మాయగాళ్లు ఎత్తుకు పైఎత్తులు వేసి నిషేధిత భూములను కూడా రెవెన్యూ అధికారుల అండదండలతో ఏదో ఓ రకంగా రిజిస్ట్రేషన్ చేసి అధిక ధరలకు అమ్మేస్తున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామం చెన్నై- కలకత్తా జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో భూములు, స్థలాల కొనుగోలుదారులు రోడ్డు సమీపాన ఉన్న వాటికి ప్రాధాన్యత ఇస్తూ కొనుగోలు చేస్తున్నారు. నెలబల్లి గ్రామ రెవెన్యూలో జాతీయ రహదారికి అనుకుని సర్వే నంబర్7లో సుమారు70ఎకరాల భూమి22ఏ నిషేధిత జాబితాలో పొందుపరిచారు. అయినా
ఆ గ్రామానికి చెందిన కొందరు చట్టంతో మాకు పనేముంది అన్న రీతిలో కొందరు ఆక్రమించే సాగు చేస్తుంటే, మరి కొందరు జామాయిల్ చెట్లను పెంచుకుంటున్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ కి సంబంధం లేని వ్యక్తులు కొందరు వ్యాపార నిమిత్తం రోడ్డు ప్రక్కన ఉన్న నిషేధిత జాబితా సర్వే నంబర్ 7 లో ఉన్న ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి హక్కు భూములుగా సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఇటీవల ఓ వ్యక్తి సచివాలయ సమీపంలో సర్వే నంబర్ 7 లో ఉన్న 40 అంకణాల భూమిని కొనుగోలు చేశామంటూ ఆ భూమికి సంబంధంలేని 168-2 గ్రామ కంఠం లో ఉన్నట్లుగా
రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం బట్టబయలైన రెవెన్యూ అధికారులు పరిశీలించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ప్రభుత్వ భూములను రక్షణ కల్పించడంలో రెవిన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని మండల ప్రజలు ఎండగడుతున్నారు. నిషేధిత భూములను క్రయ, విక్రయాలు చేయరాదనే నిబంధన ఉన్న సరాసరి ఓ అజ్ఞాత వ్యక్తి విలువైన భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం తెలిసిన ఆ గ్రామస్తులు మౌనం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటన్నది అంతు పట్టడం లేదు. గతంలో ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిషేధిత భూమి ఆక్రమించారని అధికారుల ఆదేశాలతో సర్వే చేసి హెచ్చరిక బోర్డు పెట్టడం, కొన్ని రోజులకు దానిని తొలగించడం వంటి సంఘటన కూడా జరిగి ఉంది. అదే గ్రామానికి చెందిన దళితులు వారి ఆధీనంలో ఉన్న నిషేధిత భూమిని దుక్కి దున్ని ఆరుతడు పంటలు వేస్తుంటే ఆ గ్రామస్తులంతా కూడా కట్టుకొని అడ్డగించే ఆపించిన సంఘటన జరగడంతో నేటికీ ఆ భూమి ఖాళీగానే ఉంది. ఆ గ్రామంలోని ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న స్థలాలు కబ్జా కావడానికి గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బంది సహాయ సహకారాలతో జరుగుతున్నాయని విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి కొనసాగితే
పిఓబి లో ఉన్న మొత్తం విస్తీర్ణం భూమి ఆక్రమణదారుల చెరలోకి వెళ్లిన ఆశ్చర్యపోనక్కర్లేదు.
ప్రాథమికంగా తాసిల్దార్, జిల్లాస్థాయిలో కలెక్టర్ 22ఏ భూములకు రక్షణ కల్పించాలని మండల ప్రజలు అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు.

# గురువులే సమాజానికి మార్గదర్శకులు

## - విద్యకు కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత : డా. రెడ్డివారి గురువారెడ్డి







**తిరుపతి, పెన్ పవర్, సెప్టెంబర్ 05:**
గురువుల సేవలు సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డా. రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. శనివారం తిరుపతిలోని కచ్చెపీ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న గురుపూజోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 65వ గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించడం అభినందనీయమని తెలిపారు.
కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తల్లికి వందనం కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున జమ చేయడం ప్రభుత్వ విద్యాపట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.
విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఉత్తమ ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సూచనలు తీసుకుని అమలు చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గురువారెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలను విద్యార్థులు విస్తృతంగా వినియోగించుకునేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని గురువారెడ్డి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచి, గ్రంథాలయాలను సరస్వతీ నిలయాలుగా ఉపయోగించుకునేలా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు.
సమాజంలో ఉపాధ్యాయులకు అత్యంత గౌరవప్రదమైన స్థానం ఉందని, విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పి విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.
సర్వేపల్లి రాధాకృష్ణన్ కష్టనష్టాలను అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించారని, అధ్యాపకుడిగా, వైస్‌చాన్సలర్‌గా సేవలందించి అనంతరం భారత ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన మహనీయుడని కొనియాడారు.
అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్, అతిథులతో కలిసి శాలువాలతో సత్కరించి, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, రాష్ట్ర మెడికల్ బోర్డు చైర్మన్ డా. శ్రీహరి రావు, మాజీ మంత్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వికృతమాలలో వన్నెరెడ్డి యువత సేవా సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు

## - ఐకమత్యంతో కుల అభ్యున్నతికి కృషి చేయాలి: జిల్లా అధ్యక్షుడు మునిశేఖర్



**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 05:**
వన్నెరెడ్డి యువత సేవా సంఘం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎం. మునిశేఖర్, ఉపాధ్యక్షుడు కేశవులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మునిశేఖర్ మాట్లాడుతూ యువత అంతా ఐకమత్యంతో ఉంటూ కుల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకొని ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సూచించారు. యువత సమష్టి కృషితో సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.అనంతరం వికృతమాల గ్రామ వన్నెరెడ్డి యువత సేవా సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నవంబర్ 27ను అంతర్జాతీయ బాల్య వివాహాల వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించిన ఐరాస

## బాల్య వివాహాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం: ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి. రమణ




**తిరుపతి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 05:**

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు నవంబర్ 27వ తేదీని అంతర్జాతీయ బాల్య వివాహాల వ్యతిరేక దినోత్సవంగా ప్రకటిస్తూ ఐక్యరాజ్యసమితి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రగతి సంస్థ స్వాగతించింది. ఈ సందర్భంగా కాయంపేట గ్రామస్తులతో కలిసి ప్రగతి సంస్థ సిబ్బంది సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహించారు.
తిరుపతిలోని కచ్చాపి ఆడిటోరియం, తుడా కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి. రమణ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులతో నిరంతరం సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులు బాల్య వివాహాల ముప్పును ముందుగానే గుర్తించి అడ్డుకోగలరని తెలిపారు.విద్యార్థులు అకస్మాత్తుగా పాఠశాలకు దూరమవడం, చదువులో మార్పులు రావడం, వివాహానికి సంబంధించిన సూచనలు కనిపించడం వంటి అంశాలను ఉపాధ్యాయులు గుర్తించి తల్లిదండ్రులు, అధికారులు, బాలల రక్షణ వ్యవస్థకు సమాచారం అందిస్తే అనేక బాల్య వివాహాలను ముందుగానే నిరోధించవచ్చన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల హక్కులు, విద్య ప్రాధాన్యత, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రత్యేక అంతర్జాతీయ దినోత్సవం కోసం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జే ఆర్ సి) వ్యవస్థాపకుడు భువన్ రిభు చేపట్టిన ఉద్యమం కీలక మైలురాయిని సాధించిందని కె.వి. రమణ పేర్కొన్నారు. సుమారు 67 దేశాల మద్దతుతో సియెర్రా లియోన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సెప్టెంబర్ 4న ఐక్యరాజ్యసమితి ఆమోదించడం బాల్య వివాహాల నిర్మూలన ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు అని అన్నారు.ఈ ఉద్యమంలో భాగస్వామిగా ఉన్న ప్రగతి సంస్థ, తిరుపతి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో చేస్తున్న కృషిని కొనసాగిస్తుందని తెలిపారు. పిల్లల చదువు, భవిష్యత్తు, సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్‌తో పాటు ఉపాధ్యాయులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉచిత పదో తరగతి ఆంగ్ల అధ్యయన సామగ్రి పంపిణీ




రేబాల పీఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కిల్ సర్వ్ అకాడమీ సేవా కార్యక్రమం

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 5.**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల పీఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కిల్ సర్వ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పదో తరగతి ఆంగ్ల అధ్యయన సామగ్రిని పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు పెంచడంతో పాటు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.తెలుగు ఉపాధ్యాయురాలు డి. కృష్ణవేణి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులకు అధ్యయన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డీసీబీ చైర్మన్ శ్రీ పణీష్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో పాటు స్కిల్ సర్వ్ అకాడమీ స్వచ్ఛంద సేవకులు సీహెచ్.వి. ఉమామహేశ్వరరావు, పీవీకే ప్రసాదరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.
విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా ఉచితంగా అధ్యయన సామగ్రిని పంపిణీ చేసిన స్కిల్ సర్వ్ అకాడమీ సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు అభినందించారు.

# శ్రీ సత్యసాయి నూతన చిత్రపట ఆవిష్కరణలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**నెల్లూరు పెన్ పవర్ సెప్టెంబర్ 5.**
నెల్లూరు, రామ్మూర్తి నగర్‌లోని శ్రీ సత్యసాయి భజన మందిరంలో నూతన చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమంలో శనివారం నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. నూతన చిత్రపటాన్ని ఆవిష్కరించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు, నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడారు. మనకు ఎవ్వరితోనూ పోటీ అనేది మనసులో ఉండకూడదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మనం బాగుండటంతో పాటు మనతోపాటు అందరూ ఎదగాలనే కోరుకోవాలని సూచించారు. మన దగ్గర ఉన్న రూపాయితో ఎలాంటి మంచి చేయగలమనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని, అప్పుడే మంచి రోజులు వస్తాయని అన్నారు. అందుకే మనల్ని మనం ఎవ్వరితోనూ పోల్చుకోకూడదని చెప్పారు.



**మంచి చేస్తే.. మంచి తిరిగి వస్తుంది**
ఒక రూపాయిని దేవుడి కార్యానికి ఖర్చు పెడితే అది మనకు పదిరూపాయలుగా తిరిగి వస్తుందని అన్నారు. అడగకముందే దేవుడు మనకు అవసరమైనది ఇస్తాడని చెప్పారు. దేవుడి కార్యమైనా, ప్రజాసేవ అయినా మనసుపెట్టి చేస్తే ఆ పుణ్యం మనకు తిరిగి వస్తుందని పేర్కొన్నారు. నెల్లూరులోని శ్రీ సత్యసాయి భజన మందిరంలో నూతన చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఎంపీ అన్నారు. తనను ఆహ్వానించిన నిర్వాహకులకు, సత్యసాయి సేవాదళ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.
శ్రీ సత్యసాయి భజన మందిరంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. 2013లో వీపీఆర్ కన్వెన్షన్ ప్రారంభోత్సవం సమయంలో భక్తులు, అతిథుల కోసం తీసుకొచ్చిన దాదాపు 4 వేల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేయడంలో సత్యసాయి సేవాదళ సభ్యులు అందించిన సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నానని తెలిపారు. ఆ సమయంలోనే సత్యసాయి బాబా మందిరానికి రావడం ప్రారంభమైందని చెప్పారు.
పుస్తక సేవకు రూ.20 లక్షల సాయం సత్యసాయి సేవా కార్యక్రమాల్లో భాగంగా రెండు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల వరకు పుస్తక సేవ కోసం సాయం చేసినట్లు ఎంపీ తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి చేయాలనే ఉద్దేశంతో తాను ఎప్పుడూ ముందుంటానని చెప్పారు.
వరలక్ష్మీ పూజకు సత్యసాయి సేవాదళ సహకారం కోరిన ఎంపీ టీటీడీ తరఫున నెల్లూరులో త్వరలో వరలక్ష్మీ పూజ కార్యక్రమం జరగబోతోందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 5 వేల మంది వరకు పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. గతంలో అందించిన సహకారం మాదిరిగానే ఈ కార్యక్రమానికి కూడా సత్యసాయి సేవాదళ సభ్యులు తమ సహకారం అందించాలని కోరారు.

# 52 వార్డుల్లో అభ్యర్థుల ఎంపికకు గోళ్ళ రాజేష్ సన్నాహాలు-



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5**
నంద్యాల మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడిన 52 వార్డుల స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించినట్లు సామాజికవేత్త, వ్యాపారవేత్త గోళ్ళ రాజేష్ తెలిపారు.
ప్రజా సమస్యలపై నిబద్ధతతో పనిచేసే, వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చైర్‌పర్సన్ అభ్యర్థిగా నూర్ భాషా పేరును ప్రకటించారు. అలాగే పలు వార్డులకు కౌన్సిలర్ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు. మిగిలిన వార్డుల అభ్యర్థుల పేర్లను త్వరలో ప్రకటిస్తామని, అవసరాన్ని బట్టి జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటాయని గోళ్ళ రాజేష్ కమిటీ వెల్లడించింది.

# బెజవాడ బుజ్జమ్మ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 5.**
బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్కిల్ సర్వ్ అకాడమీ ఆధ్వర్యంలో 200 మందికి స్టడీ మెటీరియల్ ను అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్ జొన్నవాడ శ్రీసతీష్ మాట్లాడుతూ. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుతూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సుజాత, ఉపాధ్యాయులు శోభ, బ్రహ్మయ్య, రమాదేవి, భార్గవి,మంజు, పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి పై మత్స్యకార నాయకులు ఫైర్

- తెలుగుదేశం మత్స్యకార నాయకులు
- 30 ఏళ్ల పాలనకు.. రెండేళ్ల అభివృద్ధే సమాధానం
- వేమిరెడ్డి దంపతులపై విమర్శలు కాదు.. కోవూరు అభివృద్ధిపై చర్చకు రండి

**కోవూరు పెన్ పవర్ సెప్టెంబర్ 5.**
కోవూరు, నెల్లూరు ప్రాంతాల్లో వైసీపీ నాయకులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు వరుసగా ప్రెస్‌మీట్‌లు నిర్వహిస్తూ నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ కోవూరు మత్స్యకార నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ప్రజల ఆదరణ కోల్పోయిన కొంతమంది నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు మహిళా నాయకురాలిపై వ్యక్తిగత విమర్శలకు దిగడం దురదృష్టకరమన్నారు. శనివారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మత్స్యకార నాయకులు మాట్లాడారు.
చంద్రుడిని చూసేవాడికి వెన్నెల.. వేలెత్తి చూపేవాడికి మచ్చే కనిపిస్తుంది
మత్స్యకార నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ.. 'చంద్రుడిని చూసేవాడికి వెన్నెల కనిపిస్తుంటే.. వేలెత్తి చూపే వాడికి చంద్రుడిలో ఉండే మచ్చ మాత్రమే కనిపిస్తుంది. ప్రస్తుతం వైసీపీ మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పరిస్థితి కూడా అలాగే ఉంది. ప్రజల కోసం పనిచేస్తున్న వేమిరెడ్డి దంపతుల సేవ, అభివృద్ధి కనిపించకుండా వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. 2026లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ప్రపంచం ముందుకు వెళ్తుంటే.. మహిళలు అన్ని రంగాల్లో నాయకత్వం వహిస్తున్న సమయంలో ఒక మహిళా ప్రజాప్రతినిధిపై వ్యక్తిగత విమర్శలు చేయడం వారి ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది. తమను ఎవరూ పట్టించుకోవడం లేదన్న అక్కసుతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని' విమర్శించారు.
వేమిరెడ్డి దంపతులు రాజకీయాల్లోకి వచ్చిన వయస్సుపై అనిల్‌కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను భాస్కర్ తిప్పికొట్టారు. 'రాజకీయాల్లోకి ఏ వయసులో రావాలో రాజ్యాంగంలో ఎక్కడైనా రాసి ఉందా? ఏ వయసులో రాజకీయాల్లోకి వచ్చినా ప్రజల కోసం పనిచేయడం ముఖ్యం. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అదే వారి నాయకత్వానికి నిదర్శనం' అని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో గత 30 ఏళ్లలో జరిగిన అభివృద్ధి, వేమిరెడ్డి



ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని రికార్డులతో పోల్చి చూస్తే వాస్తవాలు తెలుస్తాయని భాస్కర్ అన్నారు. 'గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక పనులను ప్రశాంతి రెడ్డి ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ వెళ్తున్నారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో కోవూరు ప్రజలకు కళ్లముందే కనిపిస్తోంది' అన్నారు.
2029లో వస్తామంటే గెలిచినట్టేనా
అనిల్‌కుమార్ యాదవ్ 2029లో తాము తిరిగి వస్తామని చెప్పడంపై భాస్కర్ స్పందిస్తూ.. 'రాజకీయాల్లోకి వచ్చిన ప్రతి ఒక్కరూ గెలుస్తారనే గ్యారంటీ ఉంటే ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేలే అయి ఉండేవారు. 2029లో వస్తామని చెప్పడం కంటే గతంలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలి' అన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. 'ఈరోజు మా ప్రశాంతమ్మ కార్యాలయ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. సామాన్య ప్రజలు ఎప్పుడైనా వెళ్లి తమ సమస్య చెప్పుకునే పరిస్థితి ఉంది. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలను కూడా ఆమె ఎంతో ప్రాధాన్యంతో వింటున్నారు. మా నాయకుల వెంట నడుస్తున్నామని మేం గర్వంగా చెప్పుకునే పరిస్థితి వచ్చింది' అని అన్నారు.
అనిల్‌కుమార్ యాదవ్ 'బయటపెడతాం'అంటూ చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిస్తూ.. 'ఏం బయటపెడతారో బయటపెట్టండి. మేం కూడా ప్రజల ముందు నిజాలు బయటకు రావాలని కోరుకుంటున్నాం. మీ విమర్శలు మా ఎమ్మెల్యే ప్రతిష్టను ఏమాత్రం దెబ్బతీయలేవు. పైగా మీరు మాట్లాడే ప్రతి మాటతో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పనితీరు, ప్రజలతో ఆమెకు ఉన్న అనుబంధం మరింత ప్రజలకు అర్థమవుతుంది' అని భాస్కర్ అన్నారు.
30 ఏళ్ల రాజకీయ చరిత్ర చెబుతున్నవారు.. రెండేళ్ల పాలనను చూసి భయపడుతున్నారా?
కోవూరు రాజకీయాల్లో 30 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే నాయకులు.. ప్రస్తుతం ఒక మహిళా ఎమ్మెల్యే రెండేళ్లలో చేస్తున్న అభివృద్ధిని చూసి విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందని భాస్కర్ అన్నారు. 'ఆ 30 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎన్నికలు చూశారు. ఎన్నో నాయకులను ఎదుర్కొన్నారు. కానీ ఇప్పుడు మొదటిసారి ఎన్నికల్లోనే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భారీ మెజారిటీతో గెలిచి కోవూరు తొలి మహిళా ఎమ్మెల్యేగా చరిత్ర సృష్టించారు. అది ప్రజల తీర్పు. ఆ తీర్పును గౌరవించకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన రాజకీయ పద్ధతి కాదు అన్నారు.
రూప్‌కుమార్ యాదవ్ లేకపోతే అనిల్ రాజకీయ ప్రస్థానం ఎక్కడ ఉండేదినెల్లూరులో అనిల్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా వరుసగా ప్రెస్‌మీట్లు నిర్వహిస్తున్న నాయకులపై కూడా భాస్కర్ ప్రశ్నలు సంధించారు. 'మీ నాయకుడిని రాజకీయంగా ముందుకు తీసుకువచ్చింది రూప్‌కుమార్ యాదవ్ గారు కాదా? ఒక సాధారణ వ్యక్తిని రాజకీయాల్లోకి తీసుకువచ్చి కార్పొరేటర్‌గా, ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎదిగే అవకాశం కల్పించింది ఎవరు? ఆయన మంత్రి స్థాయికి ఎదిగిన సమయంలో స్థానికంగా నాయకులను కాపాడుతూ రాజకీయంగా అండగా నిలిచింది ఎవరు? ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినప్పుడు పరిస్థితులు ఎలా మారాయో ప్రజలకు తెలుసు' అన్నారు. 'ఈరోజు అనిల్‌కుమార్ యాదవ్ రాజకీయ భవిష్యత్తు గురించి చర్చించాల్సిన పరిస్థితి రావడం వెనుక కారణాలు ఏమిటో ముందుగా ఆలోచించుకోవాలి. ప్రజల్లో కనిపించకుండా, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండి, రాజకీయంగా తన ఉనికిని చాటుకోవడానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై, ప్రశాంతి రెడ్డి పై విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు' అని అన్నారు.
రామచంద్రాపురం పంచాయతీ యూత్ ఇన్‌ఛార్జి రాము కడియాల, తెలుగుదేశం పార్టీ మత్స్యకార నాయకుడు చిన్నిబాబు కూడా మాట్లాడారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై పూర్తి ఆధారాలతో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో ఏం చేశారో, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి ఏంటో ప్రజల ముందే చర్చిద్దామని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఆవుల రవిచంద్ర, ఆవుల రవీంద్ర, ఆవుల వాసు, నరసింహ, పామంచి శేషయ్య, శ్రీహరి, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తు కోసమే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

- మంత్రి నారాయణ సూచనలతోనే డి ఎస్ ఆర్, ,ఆర్.ఎస్.ఆర్ పాఠశాలల ఆధునీకరణ
- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతుల కల్పన విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి డి ఎస్ ఆర్ పాఠశాలలో ఘనంగా గురుపూజోత్సవం, ఉపాధ్యాయులకు సన్మానం

**నెల్లూరు పెన్ పవర్ సెప్టెంబర్ 5.**
పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతోనే నెల్లూరులోని డి ఎస్ ఆర్, ఆర్ ఎస్ ఆర్ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరులోని డి ఎస్ ఆర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌లతో కలిసి ఎంపీ వేమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను నాయకులు ఘనంగా సన్మానించారు.
నారాయణ మార్గదర్శకత్వంలోనే పాఠశాలల దత్తత
ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి నారాయణ ఆలోచనలు, సూచనల మేరకే నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మారుతోందన్నారు. పేద పిల్లలకు అత్యుత్తమ వసతులతో కూడిన విద్యను అందించాలన్న



ఆయన ఆకాంక్ష మేరకు ఆర్ఎస్ఆర్ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పాఠశాలల్లో గణనీయమైన అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి పూర్తిస్థాయి మౌలిక వసతులను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు.
విద్యావేత్తగా మంత్రి నారాయణ సేవలు అభినందనీయం
చిన్ననాటి నుంచే విద్యకు, సేవా రంగానికి ప్రాధాన్యమిచ్చిన వ్యక్తి మంత్రి నారాయణ ని ఎంపీ కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ఎంతోమంది పేద పిల్లలకు ఉచితంగా విద్యనందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేసిన గొప్ప వ్యక్తిత్వం ఆయనదని పేర్కొన్నారు. డి ఎస్ ఆర్, ఆర్ ఎస్ ఆర్ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని వెల్లడించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక వసతులను, సదుపాయాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తూనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



# సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేసి తీరుతాం.. మర్రిపాడు మండలానికి నీళ్లు తీసుకొస్తాం





## - మర్రిపాడు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**ఆత్మకూరు పెన్ పవర్ సెప్టెంబర్ 5.**
డిసిపల్లిలో పండగ వాతావరణంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి ఆనం
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 800 ఆలయాల అభివృద్ధికి రూ.1,100 కోట్లతో ప్రణాళిక
మర్రిపాడు మండలంలోని ఆలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.8.12 కోట్లకు పైగా నిధులు..
డీసీపల్లి, సెప్టెంబర్ 5: సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేసి మర్రిపాడు మండలానికి సాగునీరు అందించడమే తమ లక్ష్యమని... మర్రిపాడు ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.
శనివారం మర్రిపాడు మండలం డీసీపల్లిలో శ్రీ కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.కోటి దేవాదాయ శాఖ నిధులతో మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పురాతన, గ్రామీణ దేవాలయాలను పునర్నిర్మించి ఆధ్యాత్మిక అభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.
మర్రిపాడుకు సాగునీరు అందించడమే లక్ష్యం
సోమశిల హైలెవల్ కెనాల్ ద్వారా మర్రిపాడు మండలానికి నీరు అందించే విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని మంత్రి అన్నారు. కనాల్‌కు సంబంధించిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
తాను మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఒప్పించి సోమశిల హైలెవల్ కెనాల్ ప్రాజెక్టును ప్రారంభించి, శంకుస్థాపన చేసి టెండర్లు పిలిచామని మంత్రి తెలిపారు. మొదటి విడతలో కాల్వల పనులు దాదాపు 68 శాతం మేర పూర్తయ్యాయని చెప్పారు.అయితే గత ప్రభుత్వ హయాంలో మిగిలిన 32 శాతం పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ పెండింగ్ పనులను పూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టు ప్రయోజనాలను రైతులకు, గ్రామీణ ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.
మిగిలిన 32 శాతం పనులు పూర్తయితే పొంగూరు, ఇస్కపల్లి, పెగళ్లపాడు ప్రాంతాల్లోని చెరువులు, వాగులు నీటితో నిండుతాయని తెలిపారు. తద్వారా చుట్టుపక్కల అనేక గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులను ఖచ్చితంగా పూర్తి చేసి తీరుతామని మంత్రి పునరుద్ఘాటించారు.
కోనసముద్రం రైతులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యపై కూడా మంత్రి స్పందించారు. సోమశిల నార్త్ కెనాల్‌లోని స్లూయిజ్‌ను పూర్తిస్థాయిలో పునర్నిర్మించడంతో పాటు సుమారు 300 మీటర్ల మేర కాలువ పనులు చేపట్టి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే పలు ప్రాంతాలకు నీరు చేరుతోందని, భవిష్యత్‌లో మరిన్ని ప్రాంతాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. మర్రిపాడు, ఉదయగిరి తదితర ప్రాంతాలకు నీరు అందించే విషయంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని చెప్పారు.మర్రిపాడు మండలంలో దేవాలయాల అభివృద్ధికి రూ.8.12 కోట్లకు పైగా నిధులుదేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్రిపాడు మండలంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
మర్రిపాడు మండలంలో సుమారు 15 దేవాలయాల పునర్నిర్మాణానికి రూ.75 లక్షలు, 11 శ్రీవాణి ఆలయాలకు రూ.4 కోట్లు, మరో మూడు ఆలయాలకు రూ.3.35 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మొత్తంగా మర్రిపాడు మండలంలో దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులకు రూ.8.12 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు.
గ్రామీణ ప్రాంతాల్లో నిత్య ధూపదీప నైవేద్యాలకు ఇబ్బందులు లేకుండా మర్రిపాడు మండలంలోని 21 దేవాలయాలకు నెలకు రూ.10 వేల చొప్పున నిధులు అందిస్తున్నామని, ఇందుకోసం నెలకు రూ.2.10 లక్షలు, ఏడాదికి రూ.25 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నామని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా 800 దేవాలయాల పునర్నిర్మాణానికి ప్రణాళికరాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సుమారు 800 దేవాలయాలను రెండేళ్లలో పునర్నిర్మించేందుకు దాదాపు రూ.1,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.పేద, మధ్యతరగతి ప్రజలు కూడా తమ గ్రామాల్లోనే ఆధ్యాత్మిక కార్యక్రమాలను సులభంగా నిర్వహించుకునేలా దేవాలయాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. దేవాలయాల పునర్నిర్మాణం కేవలం భవనాల నిర్మాణం కాదని.. గ్రామాల్లో ఆధ్యాత్మిక, సామాజిక ఐక్యతను పెంపొందించే కార్యక్రమమని పేర్కొన్నారు.మర్రిపాడు మండల అభివృద్ధి, సాగునీటి సమస్యల పరిష్కారం, దేవాలయాల పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

## మూడు డైరెక్టర్ స్థానాలకు ప్రశాంతంగా నామినేషన్లు..!!

ఇంజేడు,శాంతినగరం,జీసీ పాలెం స్థానాలకు ముగిసిన ప్రక్రియ..!!
..ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కొనసాగిన నామినేషన్ స్వీకరణ..!!



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5**

..నంద్యాల పట్టణం..

..విజయ మిల్క్ డెయిరీలో ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ స్థానాలకు నిర్వహించిన నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉయ్యాలవాడ మండలం ఇంజేడు,సిరివెళ్ల మండలం శాంతినగరం, బండి ఆత్మకూరు మండలం జీసీ పాలెం సొసైటీకి సంబంధించిన డైరెక్టర్ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు చేశారు..!!..నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.అభ్యర్థులు తమ అనుచరులతో నామినేషన్ కేంద్రాలకు చేరుకుని పత్రాలు సమర్పించారు. నామినేషన్ పత్రాలను అధికారులు పరిశీలించి స్వీకరించారు....మూడు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో తదుపరి దశగా నామినేషన్ల పరిశీలన,ఉపసంహరణ,తుది అభ్యర్థుల జాబితాపై దృష్టి సారించనున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో డెయిరీ డైరెక్టర్ స్థానాలపై రాజకీయ,సహకార వర్గాల్లో ఆసక్తి నెలకొంది..!!..ప్రశాంతంగా.. పకడ్బందీగా..!!..నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ప్రక్రియ అంతా ప్రశాంత వాతావరణంలో సాగింది.ఎక్కడా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించారు..!!..జీసీ పాలెం రేవంత్‌రెడ్డి//శాంతినగరం ప్రమీల//ఇంజేడు రమణలు మూడు సొసైటీలకు సంబంధించిన డైరెక్టర్లుగా నామినేషన్ వేసినట్లు విజయ మిల్క్ డైరీ ఎండి ప్రదీప్ కుమార్ తెలిపారు..!!

..ఈ ప్రక్రియ ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు..!!

## నంద్యాల మున్సిపాలిటీ 42 నుంచి 52 వార్డులుగా పునర్విభజన

### వార్డుల సరిహద్దులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలకు ఆహ్వానం

### సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు అభిప్రాయాల సమర్పణకు అవకాశం

నంద్యాల, ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 05:-

నంద్యాల పురపాలక సంఘంలో ప్రస్తుతం ఉన్న 42 వార్డులను 52 వార్డులుగా పునర్విభజించే ప్రక్రియకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో శనివారం చర్చించారు.

కమీషనర్ & డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు సర్క్యులర్ ఆర్.ఓ. నెం.13032/2/2026/ఎ1-2, తేదీ 01 సెప్టెంబర్ 2026 ద్వారా, అలాగే గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు డబ్ల్యూ.పీ.15045/2026లో తేదీ 03 సెప్టెంబర్ 2026న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నంద్యాల పురపాలక సంఘంలోని ప్రస్తుత 42 వార్డులను 52 వార్డులుగా పునర్విభజించేందుకు కొత్త షెడ్యూల్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ కు నివేదించారు. ఈ మేరకు ఫారం నెం.1 / రూల్ 4(అ) నోటిఫికేషన్ ద్వారా ప్రతిపాదిత వార్డుల సరిహద్దులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు మరియు అభ్యంతరాలను 7 రోజుల వ్యవధిలో, అనగా 05 సెప్టెంబర్ 2026 నుంచి 11 సెప్టెంబర్ 2026 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం వార్డుల సరిహద్దుల వివరణతో కూడిన ఫారం నెం.1 / రూల్ 4(అ) నోటిఫికేషన్ ప్రతులను జిల్లా కలెక్టర్ కార్యాలయం – నంద్యాల, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం – నంద్యాల, తహసీల్దార్ కార్యాలయం – నంద్యాల, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం – నంద్యాల,



ఎంపీడీవో కార్యాలయం – నంద్యాల, హెడ్ పోస్టాఫీసు మరియు నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.నంద్యాల పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు ప్రతిపాదిత వార్డుల సరిహద్దులను పరిశీలించి, తమకు ఏవైనా సలహాలు, సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని సంబంధిత ఆధారాలతో సహా 05 సెప్టెంబర్ 2026 నుంచి 11 సెప్టెంబర్ 2026 లోపు మున్సిపల్ కమిషనర్, నంద్యాల పురపాలక సంఘం కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. వార్డుల పునర్విభజన ప్రక్రియలో నిర్దేశిత నిబంధనలు, నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధివిధానాలు మరియు గడువును కచ్చితంగా పాటిస్తూ, ప్రజల నుంచి అందే అభిప్రాయాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## చైర్మన్ రేస్ లో నూర్ బాషా



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5**

నంద్యాల పురపాలక సంఘం చైర్మన్ అభ్యర్థిగా జర్నలిస్ట్ ఎంపిక. రాష్ట్రంలో మొదటి చైర్మన్ అభ్యర్థిగా జర్నలిస్ట్ ను ప్రకటించిన సేవ సంస్థ... శనివారం నంద్యాల పట్టణం ప్రముఖ సేవా సంస్థగా గోళ్ళ.... సంస్థ నిర్వాహకుడు వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తమ సంస్థ సేవకులు అభ్యర్థులుగా 52 వార్డులలో పోటీ చేస్తారని గోళ్ళ.

నంద్యాలలో యూట్యూబ్ 100 ఛానెల్ నిర్వాహకుడిగా కోన సాగుతూ గోళ్ళ సేవ కార్యక్రమాలు... నిర్వాహకులుగా నూర్ కొనసాగుతున్నారు.. రోజుకు 1500 మందికి ఉచిత భోజనాలు,పేద జర్నలిస్టులు పెన్షన్...ఆలయాలకు, చర్చిలు,మసీదులకు దాదాపు కోటి కి పైగా విరాళాలు...మొత్తం మీద సంచలన విజయం నమోదు చేసే వ్యూహంలో గోళ్ళ రాజేష్...రాష్ట్రంలో వందకు పైగా జరిగే మున్సిపల్ ఎన్నికల్లో మొట్టమొదట జర్నలిస్ట్ ను చైర్మన్ అభ్యర్థి గా ప్రకటించడం పట్ల పలువురు జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు....

## ఎస్ పి జి హై స్కూల్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు & బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5**

1. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు:

ప్రధానోపాధ్యాయులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలు, గ్రీటింగ్ కార్డులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

2. బాల్య వివాహాలపై అవగాహన:

హెడ్ మాస్టర్ నళిని మేడం మాట్లాడుతూ "ఈసారి ఉపాధ్యాయ దినోత్సవాన్ని కేవలం వేడుకలా కాకుండా, ఒక సామాజిక చైతన్య కార్యక్రమంగా నిర్వహించాము" అని అన్నారు.

ముఖ్య అతిథులు: మహిళా పోలీస్, నంద్యాల

మహిళా పోలీస్ అధికారి మాట్లాడుతూ:

"అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయడం బాల్య వివాహం, ఇది చట్టరీత్యా నేరం. రైళ్లలో పిల్లలను తరలించి పెళ్లి చేసే వారిని మేము రైల్వే స్టేషన్ లోనే పట్టుకుంటాం. మీకు ఎక్కడైనా తెలిస్తే 139 / 1098 కి కాల్ చేయండి."

డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ:

"రెడ్స్ సొసైటీ 300 గ్రామాలలో బాల్య వివాహాలు, బాల్య కార్మికులపై అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాము" అని తెలియజేసినారు.తదనంతరం టీచర్స్ కి సన్మానం చేయడం జరిగింది

ఈ కార్యక్రమం లో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంపత్, రాజు స్కూల్ హెడ్ మాస్టర్,ఆలస్కో ప్రసన్న,మాస్టర్,నళిని మహిళా పోలీస్ పాలుగోవడం జరిగింది

## నెల్లిపూడి పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

– ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఘన కార్యక్రమం
– ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రైజ్‌మనీ ప్రకటించిన సీఆర్ఎల్‌టీ ఫౌండేషన్ చైర్మన్ బుడ్డిగ సతీష్ గౌడ్

**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 5:**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగవరం మండలం నెల్లిపూడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో శుక్రవారం సరస్వతి దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఆర్ఎల్‌టీ ఫౌండేషన్ చైర్మన్, టిడిపి నాయకుడు బుడ్డిగ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామ పెద్దలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులతో పాటు మండల విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో నర్సింగరావు, గ్రామ పెద్దలను సత్కరించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా బుడ్డిగ సతీష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, పోటీ తత్వం, ఉన్నత లక్ష్యాల సాధనపై చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

విద్యార్థులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రైజ్‌మనీ అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తగిన ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు.విద్యాభివృద్ధి ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి జీవితంలో



మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు.కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలకు భోజన వసతి కల్పించారు.నెల్లిపూడి గ్రామంలో జన్మించి, గ్రామంలోని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహం కోసం బుడ్డిగ సతీష్ గౌడ్ చేపడుతున్న సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ప్రశంసించారు. తమ గ్రామంలో జన్మించిన వ్యక్తి విద్యాభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో నర్సింగరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకున్న

### జోహార్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నంద్యాల



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5**

డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జోహార్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.జోహార్ హుస్సేన్ ఆధ్వర్యం లో సహ ఉపాధ్యాయులు, ట్రైనీ టీచర్స్ ( విద్యార్థుల) సమక్షంలో ఘనముగా నిర్వహించబడినది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోహార్ హుస్సేన్ మాట్లాడుతూఉపాధ్యాయులు అంకితభావంతో , ఆదర్శవంతంగా, సామాజిక విలువలను పాటిస్తూ , నీతి నిజాయితీ తో జీవించాలని, తెలియచేశారు . ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు, ఎ. గోపాల కృష్ణ, కే .కొండారెడ్డి , సి హెచ్ . సంపత్ కుమార్ , పిచంద్రయ్య, జి .శ్యామల ఈ కార్యక్రమం లో పాల్గొని విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు మరియు సమాజంలో ఉపాధ్యాయుని ప్రాముఖ్యతను గూర్చి తెలియజేశారు.

## మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**దొరవారిసత్రం: పెన్ పవర్, సెప్టెంబర్ 5**

దొరవారి సత్రం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి షీల్డ్ తో పాటుగాప్రశంసా పత్రాలతో శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు. 1) కేసి చెంగయ్య, 2) కె రవికుమార్ 3) ఎస్ కెహుస్సేన్4) కే సురేంద్రబాబు 5) మైథిలి 6) ఆర్ శ్రీనివాసులు 7) సురేఖ అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా ఉత్తమ విద్యాశాఖ అధికారులుగా కే కొండయ్య, సిహెచ్ కృష్ణయ్య ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్నారు.

## నంద్యాల రైల్వే స్టేషన్లో

### ఉపాధ్యాయుల దినోత్సవం



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5

నంద్యాల ఈ రోజు 05 సెప్టెంబర్ 2026 నాడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నంద్యాల రైల్వే స్టేషన్‌లో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రోగ్రాం రూరల్ అండ్ ఎన్విరామెంటల్ డెవలప్మెంట్ సొసైటీ (రెడ్స్ )మరియు ఆర్పి.ఎ.ఫ్ యూనిట్ వారిచే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

సీఐ రవీంద్ర మాట్లాడుతూ –

1. బాల్య వివాహ నివారణలో మన ఆర్ పి. ఎఫ్ పాత్ర:
2. రైల్వే స్టేషన్‌లో పిల్లల భద్రతను పర్యవేక్షించడం.
3 బాల్య వివాహాలపై అవగాహన కల్పించడం, ప్రయాణికులకు సూచనలు ఇవ్వడం–
4.అనుమానిత బాల్య వివాహ కేసులను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడం.

2. అవగాహన కార్యక్రమం:

ప్రయాణికులకు లఘు ప్రసంగం ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన.

కరపత్రాల పంపిణీ & పోస్టర్ల ప్రదర్శన ద్వారా చట్టం గురించి తెలియజేసారు.

కోఆర్డినేటర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ

బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం, అమ్మాయి వయస్సు – 18, అబ్బాయి వయస్సు – 21

– 18/21 ఏళ్ల కన్నా తక్కువ వయసులో వివాహం చేయడం చట్టరీత్యా నేరం.

4. సహాయం కోసం హెల్ప్‌లైన్:

139 – రైల్వే హెల్ప్‌లైన్ – 1098 – చైల్డ్‌లైన్

జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ప్రోగ్రామ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సంపత్ ఆర్ పి. ఎఫ్ సీఐ రవీంద్ర ని సన్మానం చేయడం జరిగింది

ఈ కార్యక్రమం లో ఆర్.పి. ఎఫ్ సీఐ , స్టేషన్ మాస్టర్ , జి.ఆర్.వి రూరల్ ఎన్విరామెంటల్ డెవలప్మెంట్ ససొసైటీ (రెడ్స్ )కోఆర్డినేటర్ సంపత్, రాజు పాలుగొనడం జరిగింది

## ఉపాధ్యాయులదే కీలక పాత్ర--

### విద్యతోనే ఉన్నతి మంత్రి ఫరూక్--




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 05:**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని ఉత్తమ సేవలు అందించిన 45 మంది ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలని కోరారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని అన్నారు. ప్రతి విద్యార్థిపై సమాన శ్రద్ధ చూపాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో నంద్యాల జిల్లా ర్యాంకును మరింత మెరుగుపరిచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు.విద్యార్థులను కేవలం వైద్య, ఇంజనీరింగ్ రంగాలకే పరిమితం చేయకుండా పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లోని అవకాశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో డీఈఓ పి. జనార్దన్ రెడ్డి, డీఐఈఓ శంకర్ నాయక్, ఉపాధ్యాయులు, పురస్కార గ్రహీతలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 5**

ఈ సందర్భముగా ప్రిన్సిపల్,వివిధ విభాగాధిపతులు,ఫ్యాకల్టీ,విద్యార్థులు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ ని స్మరించుకొని పూలమాలలతో జయంతి వేడుకలను జరిపారు. ఈ సందర్భముగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు అలాగే మారుతున్న సమాజానికి సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమని తాము అభివృద్ధి చేసుకొని సిద్ధంగా ఉండాలని తెలిపారు. నేటి యువతను సన్మార్గంలో నడపడానికి, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని దేశ పురోగతిని నిర్ణయిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులకు రిఫ్రెష్టింగ్ గేమ్స్ నిర్వహించారు. వివిధ విభాగాధిపతులు మాట్లాడుతూ ఉపాధ్యయ వృత్తి ఎంతో ఉన్నతమైందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ అండ్ కల్చరల్ కోఆర్డినేటర్ ఆర్ రమాదేవి బేసిక్ సైన్స్ డిపార్ట్మెంట్ వ్యవహరించారు

# ద్వారంపూడిపై ప్రభుత్వం దృష్టి

**కాకినాడ, సెప్టెంబర్ 5, పెన్ పవర్:**
కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్ట్స్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బెజవాడ మేయర్ రేసులో వంగవీటి రాధా

**విజయవాడ, సెప్టెంబర్ 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగరంలో ఊహించని రాజకీయ పరిణామాలు ఊపందుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వెలువడే సూచనలు కనిపిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో కదలిక మొదలైంది. ఈ తరుణంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి వంగవీటి మోహన రంగా తనయుడు, సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణకు ప్రత్యేక పిలుపు రావడం బెజవాడ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సీఎం చంద్రబాబుతో రాధా త్వరలోనే భేటీ కానున్నారన్న వార్త విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమీకరణాలను పూర్తిగా మార్చేలా కనిపిస్తోంది.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లకు ఈసారి కౌన్సిలర్లు కాకుండా, ప్రజలే నేరుగా ఓటు వేసి మేయర్లను ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల పద్ధతి ని ప్రవేశపెట్టాలని కూటమి ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. విజయవాడ నగర కార్పొరేషన్ భౌగోళికంగా తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అంటే, ప్రత్యక్ష పద్ధతిలో మేయర్‌గా పోటీ చేయడమంటే దాదాపు మూడు అసెంబ్లీ స్థానాల విస్తీర్ణంలో, లక్షలాది మంది ఓటర్లను నేరుగా ఎదుర్కోవాల్సి రావడం. ఇంతటి విస్తృతమైన పరిధిలో కేవలం పార్టీ గుర్తు మాత్రమే సరిపోదని, నగరం మొత్తాన్ని ప్రభావితం చేయగల బలమైన ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని బరిలోకి దించితేనే విజయం నల్లేరుపై నడక అవుతుందని టీడీపీ అగ్రనాయకత్వం ఒక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.విజయవాడ నగర సామాజిక, రాజకీయ ముఖచిత్రంలో వంగవీటి కుటుంబానికి తరగని అభిమాన గణం ఉంది. రంగా పేరు వింటే నేటికీ బెజవాడలో ఒక ప్రత్యేకమైన ఉద్వేగం కనిపిస్తుంది. కాపు సామాజిక వర్గంతో పాటు ఇతర దిగువ, మధ్యతరగతి ప్రజల్లోనూ, యువతలోనూ రాధాకు మంచి ఆదరణ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించినప్పటికీ, అప్పట్లో సీట్ల సర్దుబాటు వల్ల రాధాకు ప్రత్యక్షంగా టికెట్ లభించలేదు. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆయన ఎలాంటి పదవినీ ఆశించలేదు. ఇప్పుడు స్వయంగా మూడు నియోజకవర్గాల సమానమైన మేయర్ పీఠానికి ఆయనను బరిలో దింపడం ద్వారా ఆయన స్థాయిని తగ్గించకుండానే సరైన గౌరవం ఇచ్చినట్లవుతుందని కూటమి పెద్దలు భావిస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరగబోయే కీలక భేటీలో ప్రధానంగా మేయర్ అభ్యర్థిత్వం గురించే చర్చించనున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యక్షంగా మేయర్ రేసులో నిలబడేందుకు రాధా సిద్ధంగా ఉన్నారా లేదా ఆయన ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది చంద్రబాబు నేరుగా తెలుసుకోనున్నారు. ఒకవేళ రాధా నేరుగా పోటీకి విముఖత చూపితే, ఆయన కుటుంబానికి చెందిన వారిని బరిలోకి దింపి, రాధాకు త్వరలోనే ఎమ్మెల్సీ లేదా ప్రభుత్వంలో సముచిత కార్పొరేషన్ పదవి ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై కూడా చర్చ జరుగుతోందని టాక్. ఒకవేళ చంద్రబాబు ప్రతిపాదనకు రాధా గ్రీన్ సిగ్నల్ ఇస్తే పోటీ ఖాయమని అనుకోవచ్చు

## గోదావరి కాలుష్యం... యాక్షన్ కి పవన్ రెడీ !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ కూటమిలో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కీలక స్థానంలో ఉన్నారు. అంతే కాదు ఆయన చేతిలో అయిదు ముఖ్య శాఖలు ఉన్నాయి. వాటిలో పర్యావరణం కాలుష్య నియంత్రణ శాఖలు కూడా ఉన్నాయి. దాంతో పవన్ ఈ శాఖల మీద ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. గతంలో ఈ శాఖలకు మంత్రులు ఉన్నా ఇంతలా వీటి గురించి చర్చించుకునేందుకు వీలు అయితే లేదనే అంటున్నారు. కానీ పవన్ కి పర్యావరణం మీద ప్రేమ ఉంది, కాలుష్యాన్ని వీలైనంతగా నియంత్రించాలని పట్టుదల ఉంది. అందుకే ఈ శాఖలు తరచూ వార్తలలోకి వస్తున్నయి. ఇక ప్రత్యేకించి ఈ శాఖల మంత్రిగా పవన్ జిల్లాలలో పర్యటిస్తూ ఎక్కడ ఉల్లంఘనలు జరిగాయో స్వయంగా తనిఖీలు చేసి మరీ ఆయా సంస్థలకు హెచ్చరికలు జారీ చేస్తూ వస్తున్నారు. ఈ మధ్యనే ఆయన రాజమండ్రీలో పర్యటించి మరీ ఆంధ్రా పేపర్ మిల్స్ వల్లనే గోదావరి నదిలో కాలుష్యం అధికం అయింది అన్నది గుర్తించారు. అయితే మొదటి తప్పుగా సంస్థకు హెచ్చరించి పరిష్కార మార్గాలని సూచించినా సంస్థ నుంచి స్పందన రాలేదని అంటున్నారు. దాంతో పవన్ ఇపుడు ఈ సంస్థ మీద చర్యలకు దిగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా చెబుతున్నారు.

**సగం కాలుష్యం వాటా :**
రాజమండ్రీ నగరంలో రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ్య వ్యర్థాలు విడుదల అవుతూంటే అందులో సగానికి సగం 35 మిలియన్ లీటర్లు ఆంధ్రా పేపర్ మిల్స్ నుంచే వస్తున్నాయని కాలుష్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాదు 2016 తరువాత కాతేరు గ్రామ పంచాయతీకి అలాగే రాజమండ్రి కార్పోరేషన్ కి ఒక్క పైసా కూడా పన్ను ఈ సంస్థ చెల్లించలేదని కూడా గుర్తించింది అంటున్నారు. అలా స్థానిక సంస్థలకు 21.34 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని అధికారుల వద్ద లెక్క ఉంది. పన్నులు చెల్లించాలని నోటీసులు ఇచ్చిన ప్రతీ సారీ కోర్టుని ఆశ్రయిస్తూ కాలయాపన చేస్తున్నారు అని కూడా కాలుష్య మంత్రిత్వ శాఖ చెబుతోంది.

**నీటిలో ఆక్సిజన్ తగ్గింది :**
సదరు సంస్థ నుంచి గోదావరిలోకి నేరుగా కలుస్తున్న ద్రవ వ్యర్థాల కారణంగా నీటిలో కాలుష్యం పేరుకుని పోయి ఆక్సిజన్ శాతం గణనీయంగా తగ్గిపోయింది అని కూడా నివేదికలు వెల్లడిస్తున్నాయి. దాంతో జల చరాలు నదిలో మనుగడకు ఇబ్బందికరంగా ఈ పరిస్థితులు మారుతున్నాయని అంటున్నారు. ఇక దుర్గంధంతో పాటు గోదావరి నీటిలో నాణ్యతా ప్రమాణాలు పడిపోయి నగర ప్రజల ఆరోగ్యం జీవన ప్రమాణాల మీద అధికంగా ప్రభావం చూపిస్తోంది అని నివేదిక వెల్లడిస్తోంది.

**తక్షణం సమన్లు జారీ :**
ఈ పరిస్థితుల్లో మూడు నెలల క్రితం క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టి హెచ్చరించినా సదరు సంస్థలో మార్పు లేదని అధికారులు పలు మార్లు సూచనలు చేసినా పాటించలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారని అంటున్నారు. ఇక ఉపేక్షించేది లేదని తక్షణం ఆ సంస్థకు సమన్లు జారీ చేసి చర్యలకు ఉపక్రమించాలని పవన్ సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అంటున్నారు. ఇక న్యాయపరంగా కూడా ప్రభుత్వం నుంచి అడ్వకేట్ జనరల్ అదనపు అడ్వకేట్ జనరల్ స్టాండింగ్ కౌన్సిల్ కి ఈ కాలుష్య ఉల్లంఘన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

**మద్దతు ఇవ్వాలి :**
ఇక వచ్చే ఏడాది 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి నదిని పవిత్రంగా కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పౌర సమాజంతో పాటు పర్యావరణవేత్తల నుంచి మద్దతు ఇవ్వాలని పవన్ కోరడం విశేషం. ప్రజా ప్రయోజనాలతో పాటు పర్యావరణ హితానికి అత్యధిక ప్రాధాన్యత కూటమి ప్రభుత్వం ఇస్తుందని పవన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని కూడా తేల్చి చెప్పారు.

# జనాల్లోకి జై కొట్టు నినాదం




**విజయవాడ, సెప్టెంబర్ 5, పెన్ పవర్:**
జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ యువ ఓటర్లపై కన్నేశారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు.. రానున్న ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటర్లను ఆకట్టుకోవాలన్న లక్ష్యంగా జనసేన పనిని ప్రారంభించింది. ఇందులో భాగంగా జనసేన యువజన విభాగాన్ని ఆర్భాటంగా పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నాడు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా జెన్ జీ ఫీవర్ అన్ని రాజకీయ పార్టీలను పట్టిపీడిస్తుంది. అందులో భాగంగా జనసేన కూడా యువత ఓట్ల కోసం వేట ప్రారంభించింది. పవన్ కల్యాణ్ పై గత రెండేళ్ల నుంచి ఎలాంటి అవినీతి ముద్ర పడలేదు. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సజావుగా, సమర్ధవంతంగా చేస్తున్నారన్న ప్రశంసలను కూడా అందుకుంటున్నారు. అవినీతి మరక అంటకుండా ఉన్న తనకు అండగా నిలబడాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నారు. యువత అండగా నిలిస్తే విజయం నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు.ఇలాగే తన వైఖరిని కొనసాగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూ జనసేనకు కూటమిలో పొత్తులో భాగంగా అత్యధిక స్థానాలను పొందవచ్చు. యువ నేతలకు పోటీకి అవకాశమిస్తే ప్రజల నుంచి కూడా ఆదరణ లభించే ఛాన్స్ ఉంది. కేవలం కాపు సామాజికవర్గానికి చెందిన ఓటర్ల పైనే ఆధార పడకుండా యువ ఓటర్లను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. పవన్ కల్యాణ్ కేరళ నుంచి తిరిగి వచ్చిన వెంటనే యువతతో ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింతగా ఎదిగే అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. యువత, మహిళ ఓటర్లను ఆకట్టుకోగలిగితే ఇక తనపై సామాజికవర్గం ముద్ర పడకపోయినా పెద్దగా ఉండదని
పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జైకొట్టు నినాదంతో... జనసేన పార్టీ యువతను, ముఖ్యంగా 'జెన్-జీ' ని ఆకట్టుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తోంది.'జై కొట్టు' యువజన విభాగంపవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పితాపురంలో జనసేన తొలిసారిగా ప్రత్యేక యువజన విభాగాన్ని ఆవిష్కరించింది.'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' స్ఫూర్తితో ఈ విభాగానికి 'జై కొట్టు' అని పేరు పెట్టారు.జెన్-జీ యువతను రాజకీయాల్లోకి, సామాజిక కార్యక్రమాల్లోకి భాగస్వామ్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. నేటి తరానికి తగినట్లుగా ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సంభాషణలు సాగించనున్నారు.సోషల్ మీడియాను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో యువత అయితే మరింత పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలుగుతారన్న నమ్మకంతో ఉన్నారు. మొత్తం మీద జనసేన ఇప్పుడు జెన్ జీ ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహంతో పవన్ కల్యాణ్ ముందుకు వెళుతున్నారు. మరి పవన్ జెన్ జీ వ్యూహం ఎంత మేరకు ఫలిస్తుందన్నది చూడాలి.

# సుదీర్ఘ పాదయాత్రకు జగన్



**కడప, సెప్టెంబర్ 5, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే. ప్రతిపక్ష నేతగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను, విశ్వసనీయతను చూపించగలిగితేనే పాదయాత్ర సక్సెస్ అవుతుంది. పాత ఫార్ములానే నమ్ముకోకుండా, సరికొత్త హామీలతో, పొరపాట్లను సరిదిద్దుకుంటూ జగన్ ప్రజల్లోకి వెళితేనే ఈ పాదయాత్ర 2.0 వైసీపీని మళ్లీ రేసులోకి తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి

# టీమిండియా ఫుల్ బిజీ.. 17 రోజుల్లో 4 సిరీస్‌లు.. షెడ్యూల్ చూస్తే షాకే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను 1--0 తేడాతో కైవసం చేసుకున్న భారత జట్టు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటుంది. రాబోయే వారం నుంచి టీమిండియా క్రీడా చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా అత్యంత బిజీ షెడ్యూల్‌ను ఎదుర్కోబోతోంది. క్రికెట్ చరిత్రలోనే మొదటిసారిగా ఒకే క్యాలెండర్ నెలలో, కేవలం 17 రోజుల వ్యవధిలో (సెప్టెంబర్ 13 నుంచి 30 వరకు) నాలుగు వేర్వేరు అంతర్జాతీయ సిరీస్‌లలో భారత జట్టు తలపడనుంది. ఇది అభిమానులకు నాన్-స్టాప్ వినోదాన్ని పంచడంతో పాటు ఇండియన్ క్రికెట్‌లో సరికొత్త మైలురాయిగా నిలవనుంది.

**ఆఫ్ఘనిస్తాన్‌తో టీ20లు.. జపాన్‌తో చారిత్రాత్మక మ్యాచ్:**

ఈ షెడ్యూల్ సెప్టెంబర్ 13న ఆఫ్ఘనిస్తాన్‌తో ప్రారంభమయ్యే 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో షురూ కానుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీలలో ఈ పోరు కొనసాగనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే సెప్టెంబర్ 22వ తేదీన జపాన్ మెన్స్ జట్టుతో టీమిండియా ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. క్రికెట్ చరిత్రలోనే భారత జట్టు జపాన్‌తో అంతర్జాతీయ మ్యాచ్‌లో పోటీపడటం ఇదే ఫస్ట్ టైమ్ కావడం విశేషం.

**ఆసియా క్రీడల్లో స్వర్ణంపై కన్నేసిన భారత్:**

సెప్టెంబర్ 24 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక ఆసియా క్రీడలు (ూంఱ్ఱఅ +ఎవం 2026) మెన్స్ క్రికెట్ ఈవెంట్‌లోనూ టీమిండియా తమ సత్తా చాటేందుకు రెడీ అయింది. ఈ టోర్నమెంట్‌లో సెప్టెంబర్ 24న ఆఫ్ఘనిస్తాన్-జపాన్ మ్యాచ్‌తో పోటీలు ప్రారంభం కాగా, పాయింట్ల ఆధారంగా నేరుగా అర్హత సాధించిన భారత జట్టు సెప్టెంబర్ 28వ తేదీన జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌తో తన ఆసియా క్రీడల ప్రస్థానాన్ని ప్రారంభించనుంది.

**వెస్టిండీస్‌తో వన్డే, టీ20 ధమాకా.. సెప్టెంబర్ 27 నుంచి షురూ:**

ఈ సిరీస్‌లు ఒకవైపు కొనసాగుతుండగానే, సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో 3 వన్డేలు, 5 టీ20ల సుదీర్ఘ సిరీస్ స్టార్ట్ కానుంది. మొదటి వన్డే సెప్టెంబర్ 27న, రెండో వన్డే సెప్టెంబర్ 30న జరగనుండగా, ఆఖరి వన్డే అక్టోబర్ 3న షెడ్యూల్ చేయబడింది. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే ఇరు జట్ల మధ్య పొట్టి ఫార్మాట్ పోరు ప్రారంభమైవనుంది. ఇలా ఒకే నెలలో నాలుగు వేర్వేరు సిరీస్‌లలో పాల్గొంటూ బీసీసీఐ (దీజజ×) సృష్టించనున్న ఈ అరుదైన రికార్డ్ క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.

## 13 జట్లు, 163 మ్యాచ్‌లు: అక్టోబర్ 10 నుంచి ఫుట్‌బాల్ ధమాకా..

# ఇండియన్ సూపర్ లీగ్ 2026-27 షెడ్యూల్ ఇదే!





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ సూపర్ లీగ్ 2026-27 సీజన్ ప్రారంభ తేదీలు అధికారికంగా ఖరారయ్యాయి. ఈ కొత్త సీజన్ అక్టోబర్ 10వ తేదీ నుంచి ప్రారంభమై మే 2027 వరకు సుదీర్ఘంగా 8 నెలల పాటు కొనసాగనుంది. సాంప్రదాయక హోమ్ అండ్ అవే ఫార్మాట్‌లో మొత్తం 13 జట్లు 163 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. లీగ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచే జట్టు షీల్డ్ విన్నర్స్ గా నిలిచి అధికారిక ఐఎస్ఎల్ ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా, ఆసియా ఖండస్థాయి టోర్నీల్లో ( ఆడే అర్హత సాధిస్తుంది. అలాగే పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ఐఎస్ఎల్ కప్ కైవసం చేసుకునేందుకు ప్లేఆఫ్స్ ఆడనున్నాయి. ఈసారి ఐఎస్ఎల్ సరికొత్త 'క్లబ్-లెడ్ మోడల్' విధానంలో నిర్వహించబడుతోంది. దీని ప్రకారం లీగ్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలు, వ్యూహాత్మక దిశానిర్దేశాలు నేరుగా ఆయా ఫుట్‌బాల్ క్లబ్‌ల చేతిలోనే ఉంటాయి. భారతీయ ఫుట్‌బాల్ ప్రతిభను ప్రోత్సహించడం, పటిష్టమైన క్యాలెండర్‌ను రూపొందించడం, పెట్టుబడులను పెంచడం ద్వారా దేశంలో ఫుట్‌బాల్ క్రీడకు స్థిరమైన భవిష్యత్తును అందించడమే ఈ నూతన విధానం ప్రధాన లక్ష్యం.

**ఐఎఫ్ఎల్ విజేతపై క్రమశిక్షణా వేటు:**

2025-26 ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్ టైటిల్ గెలుచుకుని ఐఎస్ఎల్‌కు ప్రమోషన్ సాధించిన డైమండ్ హార్బర్ ఎఫ్‌సీకి ఊహించని షాక్ తగిలింది. రూల్స్ ప్రకారం చెల్లించాల్సిన పరిపాలనా రుసుము ను గడువులోగా చెల్లించడంలో విఫలమవడంతో ఆ జట్టుపై నిర్వహణ మండలి చర్యలు తీసుకుంది. ప్రమోషన్ అండ్ రెలిగేషన్ నిబంధనల ప్రకారం ఈ సీజన్‌లో డైమండ్ హార్బర్ ఎఫ్‌సీకి ఎలాంటి పాయింట్లు కేటాయించలేదు. పాయింట్ల పట్టికలో ఆటోమేటిక్‌గా చివరి స్థానంలో నిలవనున్న ఈ జట్టు, 2027-28 సీజన్‌కు ఐఎస్ఎల్ హోదాను కోల్పోయి తిరిగి ఐఎఫ్ఎల్‌కే పరిమితం కానుంది.

**రంగంలోకి 13 జట్లు:**

ఈ రాబోయే ఐఎస్ఎల్ 2026-27 పోరులో పాల్గొనే 13 జట్ల వివరాలు ఇవే:

బెంగళూరు ఎఫ్‌సీ, చెన్నైయిన్ ఎఫ్‌సీ, ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ, ఎఫ్‌సీ గోవా, ఇంటర్ కాశీ ఎఫ్‌సీ

కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ, మోహన్ బగాన్ సూపర్ జెయింట్, ముంబై సిటీ ఎఫ్‌సీ, నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ

ఒడిశా ఎఫ్‌సీ, పంజాబ్ ఎఫ్‌సీ, స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ, చర్చిల్ బ్రదర్స్ ఎఫ్‌సీ

ఈ టోర్నీలో పాల్గొంటున్న చర్చిల్ బ్రదర్స్ ఎఫ్‌సీ క్లబ్ భాగస్వామ్యం మాత్రం అధికారిక రెగ్యులేటరీ ఆమోదాలకు లోబడి ఉండనుండటం గమనార్హం. భారీ మార్పులతో ప్రారంభమవుతున్న ఈ 8 నెలల సుదీర్ఘ ఫుట్‌బాల్ పండుగ అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.

# సీఎస్కే కెప్టెన్ మారనున్నాడా? తెరపైకి మరో స్టార్ బ్యాటర్ పేరు..!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) కెప్టెన్సీపై ఆసక్తికర చర్చ మొదలైంది. గత మూడు సీజన్లుగా జట్టు ప్లేఆఫ్స్‌కు చేరకపోవడంతో నాయకత్వంలో మార్పు అవసరమని మాజీ భారత ఓపెనర్ సదగోపన్ రమేశ్ అభిప్రాయపడ్డారు. కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌కు బదులుగా సంజూ శాంసన్‌ను ఎంపిక చేయాలని సూచించారు. సంజూ అద్భుతమైన టీమ్ ప్లేయర్ అని ఆయన పేర్కొన్నారు.గత మూడు ఐపీఎల్ సీజన్లలో సీఎస్కే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. దీనికి తోడు 2026 సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ బ్యాటింగ్ ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జట్టులో సంజూ శాంసన్ చేరడం కెప్టెన్సీ మార్పుపై ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది.

"సీఎస్కే కెప్టెన్సీ కోసం పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. మార్పు అవసరమా అనే అంశంపైనా ఆలోచిస్తోంది. సంజూ శాంసన్‌ను కెప్టెన్‌గా పరిగణించాలి. అతను అద్భుతమైన టీమ్ ప్లేయర్" అని సదగోపన్ రమేశ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో పేర్కొన్నారు.ఐపీఎల్‌లో సంజూ శాంసన్ కెప్టెన్‌గా 66 మ్యాచ్‌లకు నాయకత్వం వహించారని, అందులో 33 మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించారని రమేశ్ గుర్తుచేశారు. అంటే అతని విజయాల శాతం 50గా ఉందన్నారు. అతని నాయకత్వంలో రాజస్థాన్ రాయల్స్ ఒకసారి ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిందని తెలిపారు.అయితే సంజూను కెప్టెన్‌గా నియమించినంత మాత్రాన సీఎస్కే సమస్యలన్నీ పరిష్కారం కావని రమేశ్ స్పష్టం చేశారు. జట్టులో ఇంకా చాలా మార్పులు అవసరమని చెప్పారు.మరోవైపు రుతురాజ్ గైక్వాడ్ 2026 ఐపీఎల్‌లో 337 పరుగులు మాత్రమే చేశాడు. అతని బ్యాటింగ్ సగటు 28గా ఉంది. పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేసిన ఆటగాళ్లలో అత్యల్ప స్ట్రైక్‌రేట్ నమోదు చేసిన వారిలో రుతురాజ్ ఉన్నాడు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పిస్తే బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా ఆడే అవకాశం ఉంటుందని మాజీ భారత క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ కూడా గతంలో అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీ నుంచి తప్పించడం రుతురాజ్‌కు, సీఎస్కేకి ప్రయోజనకరమేనని అన్నారు.

# గూగుల్ లో నా పేరు కొడితే.. అదే నా లైఫ్ లో ఎపిక్ మూమెంట్: వైష్ణవి చైతన్య







బేబీ సినిమాతో యూత్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య.. ఇప్పుడు వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. ఆనంద్ దేవరకొండతో కలిసి బేబీలో నటించి సూపర్ హిట్ అందుకున్న ఆ జోడీ.. మరోసారి ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 90ం మిడిల్ క్లాస్ బయోపిక్ సిరీస్ తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హాసన్ ఆ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా హైదరాబాద్ లో జరిగిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో వైష్ణవి చైతన్య తన సినీ జర్నీ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఓ సంఘటనను గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు 'నిన్ను ఎవరు గుర్తుపడతారు? గూగుల్ లో నీ పేరు కొడితే నీ గురించి వస్తుందా?' అంటూ తనను ప్రశ్నించారని తెలిపారు. ఆ మాటలు ఎంతో బాధపెట్టాయని చెప్పారు. అయితే అదే ప్రశ్నకు ఇప్పుడు తన విజయమే సమాధానంగా మారిందన్నారు. 'ఒకప్పుడు నన్ను ఎవరు గుర్తుపడతారా? అని అడిగారు. గూగుల్ లో నీ కోసం వస్తుందా' అని ప్రశ్నించారు. అప్పుడు చాలా బాధపడ్డాను. కానీ ఇప్పుడు గూగుల్‌లో వైష్ణవి చైతన్య అని పేరు టైప్ చేస్తే.. నా గురించి పూర్తి వివరాలు వస్తాయి. ఇదే నా జీవితంలో ఎపిక్ మూమెంట్ అని వైష్ణవి చెప్పుకొచ్చారు.తన కెరీర్ లో సాధించిన గుర్తింపును ఆమె ఎమోషన్ తో పంచుకున్నారు. ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కు చీఫ్ గెస్ట్ గా వచ్చిన రష్మిక మందన్నకు వైష్ణవి ప్రత్యేకంగా థ్యాంక్స్ తెలిపారు. నేషనల్ క్రష్ నుంచి నేషనల్ స్టార్ గా ఎదిగిన రష్మిక ప్రయాణం తనతో పాటు ఎంతో మంది అమ్మాయిలకు ఇన్స్పిరేషన్ అని అన్నారు. ప్రతి ఒక్కరిలోనూ స్పెషల్ టాలెంట్ ఉంటుందని, మరొకరిలా మారాల్సిన అవసరం లేదనే విషయాన్ని రష్మిక తన ప్రయాణంతో నిరూపించారని ప్రశంసించారు.బేబీ సినిమా నుంచి ఆనంద్ దేవరకొండ తనకు తెలుసని, అప్పటికి ఇప్పటికీ ఆయనలో పెద్దగా మార్పు కనిపించలేదని వైష్ణవి తెలిపారు. 'ఆయన నుంచి నేను ఒక విషయం నేర్చుకున్నాను. మన చుట్టూ ఉన్నవారు ఎదిగితే మనం కూడా సంతోషించాలి. ఆనంద్ చాలా రేర్ పర్సన్' అని అన్నారు. ఎపిక్ దర్శకుడు ఆదిత్య హాసన్ తనకు బెస్ట్ ఫ్రెండ్, ఫేవరెట్ డైరెక్టర్ అని వైష్ణవి తెలిపారు. సెట్స్ లో ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటారని, అవసరమైన విషయాలను స్పష్టంగా వివరించడంతో పాటు దర్శకుడిలా కాకుండా మంచి స్నేహితుడిగా తనకు అండగా నిలిచారని చెప్పారు. సినిమాలో తనను ఎంపిక చేసినందుకు థ్యాంక్స్ తెలిపారు.'ఈవెంట్ కు గెస్టులుగా వచ్చిన వారందరికీ థ్యాంక్స్. శివ నిర్వాణ సార్.. ఇరుముడి సక్సెస్ అయినందుకు కంగ్రాట్స్. మా అమ్మమ్మ కూడా ఆ సినిమాకు వచ్చింది. మూవీ చూసి ఎమోషనల్ అయింది. ప్రతి రోజూ ఇరుముడి సాంగ్స్ అండ్ వైబ్ ఉంటుంది. యాలోయాలో సాంగ్ అయితే సూపర్. శివ సార్.. నాకు టక్ జగదీష్ మూవీ జర్నీ గుర్తుంది. ఎప్పటికీ గుర్తుంటుంది. బేబీ తర్వాత నాకు మీ నుంచి వచ్చిన కాల్ రోజు కూడా గుర్తుంది. మాటలు కూడా గుర్తున్నాయి' అని వైష్ణవి తెలిపారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965